క్లుప్తంగా

ప్రత్యేక పూజల్లో మేయర్ కావటి



నగరంపాలెం: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఆర్.అగ్రహారం రామనామక్షేత్రం ప్రధాన రహదారిలో నూతనంగా నిర్మించిన ధ్యాన పరమేశ్వరుని విగ్రహానికి బుధవారం నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించగా, స్థానిక పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

అలరించిన నృత్య జాగరణ



నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలోని అన్నమయ్య కళావేదికపై బుధవారం మహాశివరాత్రి సందర్భంగా రాత్రి ఏడు గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు శివపాద మంజీర నాదం -2, శివరాత్రి నృత్య జాగరణ నిర్వహించారు. సాయి మంజీర కూచిపూడి ఆర్ట్ అకాడమీ ఆధ్వర్యంలో జరగ్గా, డాక్టర్ భూసురపల్లి వెంకటేశ్వర్లు, బోల్లేపల్లి సత్యనారాయణ, ఆలయ అధ్యక్షులు సిహెచ్.మస్తానయ్య ప్రారంభించారు. 108 మంది తమ నృత్య ప్రదర్శనతో శివునికి నృత్య నివేదన చేశారు. నాట్యాచార్య డాక్టర్ కాజ వెంకటసుబ్రహ్మణ్యం నృత్య దర్శకత్వంలో ప్రదర్శన కార్యక్రమాలు నిర్వహించారు. వెంకటగిరి నాగలక్ష్మి, తాళ్లూరి ధరణి, పూజిత, శ్రీమహిత పర్యవేక్షించారు.

నేడు చేబ్రోలులో రథోత్సవం

చేబ్రోలు: స్థానిక గంగాపార్వతీ సమేత నాగేశ్వరస్వామి ఆలయ రథోత్సవ గురువారం నిర్వహించనున్నట్లు దేవదాయశాఖాధికారి వినయ కృష్ణ బుధవారం తెలిపారు. మహాశివరాత్రిని పురస్కరించుకుని బుధవారం నాగేశ్వరస్వామి, గంగా పార్వతి అమ్మవార్ల కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. పురాతనమైన భారీ రథంపై ప్రధాన రహదారుల్లో కల్యాణమూర్తులు దర్శనం ఇవ్వనున్నారు. సాయంత్రం మూడు గంటలకు స్వామి రథోత్సవం గ్రామంలోని ప్రధాన వీధుల్లో ఉంటుందని వివరించారు.

అంజుమన్ కమిటీ అధ్యక్షుడిగా మక్బుల్ బేగ్



పొన్నూరు: పట్టణానికి చెందిన ప్రముఖ న్యాయవాది మక్బుల్ బేగ్ అంజుమన్ కమిటీ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మౌలానా అబ్దుల్ కలాం షాదీఖానాలో బుధవారం నిర్వహించిన అంజుమన్ కమిటీ సర్వసభ్య సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం మక్బుల్ బేగ్‌ను ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. మగ్బుల్ బేగ్ మాట్లాడుతూ ముస్లింల అభ్యున్నతికి కృషి చేస్తానని అన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

గుంటూరు రూరల్: అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని తోకావారిపాలెంలో చోటుచేసుకుంది. కోఫూరి శ్రీనివాసరావు(45) ఆటోడ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. బుధవారం గ్రామ శివారులోని బండారుపల్లి సమీపంలో రైల్వే ట్రాక్‌పై శవం ఉందని స్థానికుల సమాచారం మేరకు గ్రామస్తులు ఘటనా స్థలికి చేరుకోగా మృతుడు శ్రీనివాసరావు అని తేలింది. దీంతో మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం రైల్వే పోలీసులు జీజీహెచ్ మార్చురీకి తరలించారు. మృతుడు శరీరంపై ఎటువంటి గాయాలు లేకపోవటం, కేవలం తలకు మాత్రమే గాయాలై తీవ్ర రక్త స్రావంతో మృతి చెంది రైలు పట్టాలపై పడి ఉండటంతో మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్టీసీ సేవలను ఉపయోగించుకోండి



తెనాలిఅర్బన్: ప్రయాణికులను సురక్షితంగా తమ గమ్యస్థానాలకు తీసుకువెళ్ళేది ఆర్టీసీ బస్సులని, అందరు వాటిలో ప్రయాణించాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న పేర్కొన్నారు. మహాశివరాత్రిని పురస్కరించుకుని తెనాలి డిపో నుంచి గోవాడ, క్వారీలకు ఏర్పాటు చేసిన ప్రత్యేక బస్సు సర్వీస్‌లను బుధవారం తెల్లవారుజామున ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా డిపో మేనేజర్ ఎ.రాజశేఖర్ మాట్లాడుతూ తెనాలి డిపో నుంచి క్వారీకి 30, గోవాడకు 30, శ్రీశైలంకు 8, చెరుకుపల్లి, గోవాడకు అదనంగా మరో 2 బస్సులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బస్సులు బుధవారం తెల్లవారుజాము నుంచి గురువారం ప్రయాణికుల రద్దీ తగ్గే వరకు తిరుగుతూనే ఉంటాయని చెప్పారు. సాధారణ చార్జీలకే బస్సులు నడుపుతున్నట్లు వివరించారు. ప్రయాణికులందరు ఆర్టీసీ బస్సు సేవలను ఉపయోగించుకోవాలని సూచించారు.

ఓం నమశివాయ..

భక్తి శ్రద్ధలతో మహాశివరాత్రి వేడుకలు



మారుతినగర్‌లోని శ్రీమారుతీ దేవాలయ ప్రాంగణంలో శివ లింగానికి అభిషేకం

- కిక్కిరిసిన శైవక్షేత్రాలు
- బారులు తీరిన భక్తులు



అరండల్‌పేటలోని సోమసుందరస్వామి దేవస్థానంలో స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

నగరంపాలెం: నగరంలో కొలువైన శైవక్షేత్రాలు శివ నామస్మరణతో మార్మోగాయి. వందేళ్లకు పైబడిన పురాతనమైన శివాలయాలతో పాటు ప్రధాన కూడళ్లల్లో నెలకొన్న దేవాలయాలు భక్తులతో కిక్కిరిశాయి. భక్తులు బారులు తీరారు. తెల్లవారుజాము నుంచి స్వామి, అమ్మ వార్లను దర్శించుకునేందుకు ఆలయాల వద్దకు చేరుకున్నారు.

■ స్థానిక మారుతీనగర్‌లోని కంచి కామకోటి పీఠ మారుతీ దేవాలయ ప్రాంగణంలో తెల్లవారుజాము నాలుగు గంటల నుంచి మహాన్యాస పూర్వక ఏకాదశి రుద్రాభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం శ్రీశారద రామలింగేశ్వర భజన సమాజం భక్తి సంకీర్తనలు అలపించారు. రాత్రికి లింగోద్భకాల అభిషేకాలు, గంగా గౌరీ సమేత గౌరీశంకరస్వామి సామూహిక కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, స్వామిని దర్శించుకున్నారు. తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యదర్శి తంగిరాల శ్రీనివాస్ పర్యవేక్షించారు.

■ స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం ధార్మిక ప్రాంగణంలోని యాగశాలలో లక్ష్మీగణపతి, రుద్రా, చండి హోమాలు, మహాపూర్ణాహుతితో ముగిశాయి. బొల్లేపల్లి సత్యనారాయణ, లలితాంబ దంపతుల ఆధ్వర్యంలో జరగ్గా, ప్రాంగణంలోని శివలింగానికి బొర్రా ఉమామహేశ్వర రావు, అశోక్, నూతలపాటి తిరుపతయ్య, లంక విజయబాబు అభిషేకార్చన నిర్వహించారు.

■ అరండల్‌పేట 4/4వ అడ్డరోడ్డులోని శ్రీగంగా మీనాక్షి సోమసుందరస్వామి దేవస్థానంలో స్వామి వార్లకు ప్రత్యేక పూజలు చేశారు. పరిసర ప్రాంతాల్లోని భక్తులు భారీగా తరలిరావడంతో శివాలయం కిక్కిరిసింది. పట్టాభిపురంలోని శివాలయంలో, శ్యామలానగర్‌లోని సంతోషిమాత దేవాలయం, మల్లారెడ్డినగర్‌లోని పార్వతి వర్ధిని సమేత శ్రీరమలినేశ్వరస్వామికి అభిషేకార్చనలు, శివ పార్వతుల కల్యాణాలు వైభవోపేతంగా జరిగాయి. కల్యాణ మహోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.



పట్టాభిపురం శివాలయంలో ప్రత్యేక అలంకరణ



శ్యామలానగర్‌లోని సంతోషిమాత దేవాలయంలో భక్తులు

బ్రాడీపేట శివాలయంలో..

నగరంపాలెం: మహా శివరాత్రి పండుగను పురస్కరించుకుని బ్రాడీపేట 2/7వ అడ్డరోడ్డులోని శ్రీగౌరీ విశ్వేశ్వరాలయం లో బుధవారం ప్రత్యేక అలంకరణ, అభిషేకాలు నిర్వహించారు. స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. స్వామి వారిని దర్శించుకున్న అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.



బ్రాడీపేట 2/7వ అడ్డరోడ్డులోని శ్రీగౌరీ విశ్వేశ్వరాలయంలో పూజలు



ప్రత్యేక అలంకరణలో అగస్త్యేశ్వర స్వామి

పట్నంబజారు: హర హర.. మహాదేవా అంటూ శైవ క్షేత్రాలు బుధవారం మార్మోగాయి. భక్తులతో కిటకిటలాడాయి. పాతగుంటూరులోని గంగా పార్వతి సమేత అగస్త్యేశ్వర స్వామి ఆలయంలో స్వామికి విశేష పూజలు నిర్వహించారు. తెల్లవారుజాము 4 గంటల నుంచే స్వామికి విశిష్ట పూజలు చేశారు. వేద పండితులు, అర్చకులు విశేష ద్రవ్యాలతో అర్చన, బలిహరణ, రుద్రహోమం, పరివార దేవతా హోమం నిర్వహించి, మధ్యాహ్నం 2 గంటల సమయంలో మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. సాయంత్రం 6 గంటల సమయంలో పరదోష కాల్పాన నిర్వహించారు. రాత్రి సమయంలో లింగోద్భావ కాలం నందు మహన్యాస పూర్వక రుద్రాభిషేకాన్ని అర్చకులు ప్రత్యేకంగా నిర్వహించారు. రాత్రి ఒంటి గంట సమయలో అగస్త్యేశ్వరస్వామి, గంగా పార్వతి అమ్మవార్ల దివ్యశాంతి కల్యాణ మహోత్సవం అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు.



మల్లారెడ్డినగర్‌లోని పార్వతి వర్ధిని సమేత శ్రీరమలినేశ్వరస్వామికి అభిషేకార్చనలు



బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలోని శివలింగానికి అభిషేకం

మల్లికార్జునస్వామి దేవస్థానంలో పూజలు



మల్లికార్జునస్వామి, భ్రమరాంబ అమ్మవారి కల్యాణ మహోత్సవం

గుంటూరు ఎడ్యుకేషన్: మల్లికార్జునపేటలోని గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి దేవస్థానంలో బుధవారం మహా శివరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఉదయం 5.00 గంటల నుంచి స్వామికి విశేష అభిషేకాలను నిర్వహించారు. సాయంత్రం స్వామివారు, అమ్మవార్లకు భక్తులు సామూహిక కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు దర్శనం చేసుకున్నారు.

ఈశ్వరీయ విశ్వ విద్యాలయంలో పూజలు

నగరంపాలెం: స్థానిక దేవాపురం రెండో వీధిలోని ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వ విద్యాలయంలో బుధ వారం శివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలు చేపట్టారు. శివపరమాత్మ పతాకావిష్కరణ చేశారు. దీప ప్రజ్వలన, సప్తవర్ణ శోభిత, శివలింగార్చన నిర్వహించారు. జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులు, జీజీహెచ్ సూపరింటెండెంట్ రమణ యశస్విను సత్కరించారు. సేవా కేంద్ర నిర్వాహకురాలు ఉమారాజేశ్వరి, జయలక్ష్మి(విజయవాడ), సుహాసిని(పిడుగురాళ్ల), అరుణ(నరసరావుపేట), శాంతి (చిలకలూరిపేట) పాల్గొనగా భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.



మాట్లాడుతున్న జీఎంసీ కమిషనర్ శ్రీనివాసులు

గోరంట్ల జూకుంట.. అక్రమాల పుట్ట



గోరంట్ల జూకుంటలో అక్రమంగా తవ్వకాలు చేస్తున్న దృశ్యం

యథేచ్ఛగా టీడీపీ నేతల తవ్వకాలు

- లారీ రూ.6,500, ట్రాక్టర్ రూ.3,000 విక్రయాలు
- ప్రజా ప్రతినిధి కనుసన్నల్లో తవ్వకాలు
- పట్టించుకోని అధికారులు

గుంటూరు రూరల్: అధికారమే హద్దుకు టీడీపీ నాయకులు రెచ్చిపోతున్నారు. మట్టి.. పుట్ట.. గట్టు తేడా లేకుండా యథేచ్ఛగా తవ్వేస్తున్నారు. అనుమతులు ఊసే లేకుండా పోయింది. అక్రమార్జనకు తెరదీశారు. రూ.లక్షల్లో డబ్బులు బొక్కేస్తున్నారు. మొత్తానికి ప్రజాప్రతినిధి బావమరిది నడిపిస్తుండడం విస్మయం కల్పించే అంశం. అధికారులు అటువైపు చూసిన దాఖలాలు కనిపించడం లేదు. నియోజకవర్గం వ్యాప్తంగా గోరంట్ల, ఓబులునాయుడుపాలెం, నాయుడుపేట, యనమదల, పాత్తూరు, వెంగళాయపాలెం, చిన్నపలకలూరు తదితర గ్రామాల్లో మట్టి తవ్వకాలు చేస్తున్నారు. గోరంట్లలోని జూకుంటలో నిత్యం అక్రమ తవ్వకాలు కొనసాగుతూనే ఉన్నాయి. రాత్రి వేళల్లో తవ్వకాలు చేస్తూ ఉదయాన్నే తమకేమి తెలియదన్నట్లు టీడీపీ నేతలు వ్యవహరిస్తూ లక్షలాది రూపాయల ప్రజా ధనాన్ని కొల్లగొడుతున్నారు. లారీ రూ.6,500, ట్రాక్టర్ రూ.3,000 వంతున రోజుకు కనీసం వందల సంఖ్యలో మట్టిని లారీలు, ట్రాక్టర్ల ద్వారా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ప్రజా ప్రతినిధి బంధువే అక్రమార్జనకు తెరతీయటంతో తామే ఏం చేయలేకపోతున్నామని అధికారులు వాపోతున్నారు. ప్రతి లారీకి ప్రజా ప్రతినిధి బావమరిదికి రూ.2,500 చొప్పున చెల్లించాలని, లేదా నెలకు రూ.6 లక్షల వంతున చెల్లించినా వారికి అనుమతులు అతడే ఇస్తున్నాడని సమాచారం. చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కొండలను కొల్లగొడుతున్నారు..

మండలంలోని తురకపాలెం, చిన్నపలకలూరు పంచాయతీకి సంబంధించిన సర్వే నంబర్ 111లో కొండ పోరంబోకు స్థలం సుమారు 20 సెంట్ల స్థలం ఉంది. టీడీపీ కార్యకర్తలు ఈ ప్రభుత్వ స్థలాన్ని ఎలాగైనా కబ్జా చేయాలని పన్నాగం పన్నారు. అనుకున్నదే తడవుగా భారీ పొక్లెయిన్‌తో కొండను తొలిచి మట్టి విక్రయించారు. దీని ద్వారా రూ.లక్షల్లో ఆదాయం పొందారు. అదే విధంగా కొండను తవ్వి మట్టి తీసిన ప్రాంతంలో సుమారు ఎకరా స్థలాన్ని చదును చేశారు. ప్రభుత్వ భూమిని చదును చేసి కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నా కనీసం రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదు. గతంలో ఈ స్థలంలో స్థానిక సొసైటీ ఆధ్వర్యంలో గోదాములను నిర్మించాలని ప్రయత్నించారు. అప్పట్లో కొండ పోరంబోకు స్థలమని ప్రయత్నాన్ని విరమించుకున్నారు. కానీ నేడు టీడీపీ కార్యకర్తలు మొత్తం కబ్జా పనిలో ఉన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు సర్వం సిద్ధం

- నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో 11 పోలింగ్ కేంద్రాలు
- ఓటు హక్కు వినియోగించుకోనున్న 10,294 మంది పట్టభద్రులు
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికార యంత్రాంగం
- బందోబస్తు ఏర్పాట్లు పరిశీలించిన పోలీసులు



పోలింగ్ కేంద్రాల వద్ద బందోబస్తు ఏర్పాట్లును పరిశీలిస్తున్న ఎస్‌ఐలు

ప్రత్తిపాడు: కృష్ణా- గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు సర్వం సిద్ధమయింది. నియోజకవర్గంలోని ప్రత్తిపాడు, పెదనందిపాడు, కాకుమాను, వట్టిచెరుకూరు మండలాలలతో పాటు గుంటూరు ఈస్ట్, వెస్ట్ మండలాల్లోని 10, 294 మంది పట్టభద్రులు తమ ఓటు హక్కును గురువారం వినియోగించుకోనున్నారు. అందుకు సంబంధించి కాకుమాను మండలంలో ఒక పోలింగ్ బూత్, మిగిలిన మండలాల్లో మండలానికి రెండు చొప్పున పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశారు. ఆయా పోలింగ్ బూత్‌ల వద్ద బందోబస్తు ఏర్పాట్లును బుధవారం సాయంత్రం పోలీసులు పరిశీలించారు. ఒక్కో పోలింగ్ బూత్‌లో ప్రిసైడింగ్ అధికారి, సహాయ ప్రిసైడింగ్ అధికారితో పాటు పలువురు సిబ్బంది ఎన్నికల విధుల్లో పాల్గొననున్నారు. ఇప్పటికే ఏర్పాట్లను, కేంద్రాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలను ఎన్నికల అధికారులు పర్యవేక్షించారు. జిల్లా ఉన్నతాధికారులు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా సిబ్బందిని అప్రమత్తం చేశారు.

కేంద్రాల వద్ద వసతులపై అధికారుల పరిశీలన

పొన్నూరు: ఉమ్మడి కృష్ణా- గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటింగ్‌కు పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేసినట్లు తహసీల్దార్ మహమ్మద్ జియావుల్‌హక్ తెలిపారు. బుధవారం పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని ఐదు పోలింగ్ కేంద్రాలను మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ల రమేష్‌బాబుతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఓటర్లు ఓటు స్లిప్‌తో పాటు ఎన్నికల సంఘం నిర్దేశించిన 10 గుర్తింపు కార్డులను ఏదో ఒకటి తీసుకుని పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. గుర్తింపు కార్డు లేకుండా ఓటు హక్కు వినియోగించుకోవడం కుదరదన్నారు. కమిషనర్ మాట్లాడుతూ పొన్నూరు నియోజకవర్గంలో మొత్తం 10 పోలింగ్ బూత్‌లు ఉన్నాయని తెలిపారు. 8035 మంది ఓటర్లు ఉండగా వారిలో పురుషులు 4982. మహిళలు 3052, ఇతరులు 1 ఉన్నారని వెల్లడించారు. పోలింగ్ కేంద్రంలోకి సెల్‌ఫోన్లు, స్మార్ట్ వాచ్‌లు అనుమతి లేదని చెప్పారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో సజావుగా జరిగేలా రాజకీయ పార్టీలు, ఓటర్లు సహకరించాలని కోరారు.



నిడుబ్రోలు జెడ్పీ హైస్కూల్‌లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

నియోజకవర్గంలో పోలింగ్ బూత్‌ల వారీగా ఓటర్ల వివరాలు..

మండలం	పోలింగ్‌బూత్ నంబరు	ఓటర్ల వివరాలు
గుంటూరువెస్ట్	252	1,164
గుంటూరువెస్ట్	253	1,155
గుంటూరుఈస్ట్	254	1,579
గుంటూరు ఈస్ట్	255	1,251
ప్రత్తిపాడు	256	703
ప్రత్తిపాడు	257	617
పెదనందిపాడు	258	831
పెదనందిపాడు	259	772
కాకుమాను	260	1,076
వట్టిచెరుకూరు	267	572
వట్టిచెరుకూరు	268	574
మొత్తం	11	10,294

డంపింగ్ యార్డులను తలపిస్తున్న ఖాళీ స్థలాలు



ఫిరంగిపురంలోని ఓ స్థలంలో చెత్తాచెదారం

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని పలు ప్రాంతాల్లో ఖాళీ స్థలాలు డంపింగ్ యార్డులుగా మారాయి. యజమానులు పట్టించుకోకపోవడంతో చుట్టుపక్కల నివాసం ఉంటున్న వారు అవస్థలు పడుతున్నారు. కొత్తపేట, రసూలుపేట, బీఎస్ఎన్ఎల్ బజారు, కొండమెట్ల బజారు, రాజాపేట, శాంతిపేట, రైల్వేస్టేషన్ రోడ్డు, ఎస్టీ కాలనీ, అల్లంవారిపాలెం రోడ్డు, ఆరోగ్యనగర్ రోడ్డు, కరెంటు ఆఫీసు వంటి ప్రాంతాల్లో పలు ఖాళీ స్థలాలు ఉన్నాయి. ఇంటి నిర్మాణాల కోసం కొనుగోలు చేసిన స్థలాల యజమానులు పట్టించుకోకుండా వదిలి వేశారు. దీంతో వాటిల్లో పిచ్చి మొక్కలు మొలుస్తున్నాయి. కొన్ని స్థలాల్లో మురుగునీరు చేరి దుర్వాసన వెదజల్లుతోంది. పాములు, తేళ్ల వంటి విషజీవులు చేరుతున్నాయి. పందులు కూడా సంచరిస్తున్నాయి. దోమలతో రోగాల బారిన పడుతున్నామని నివాసితులు వాపోతున్నారు. పారిశుద్ధ్య కార్మికులు చెత్తను తొలగించకపోవడంతో అవస్థలు పడుతున్నట్లు చెబుతున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి స్థలాలు ఉన్న యజమానులకు నోటీసులు ఇచ్చి, శుభ్రం చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

'మిస్టర్ నాగార్జున'కు అభినందన

తెనాలి: ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో ఈనెల 24న జరిగిన అంతర కళాశాలల శరీర సౌష్టవ పోటీల్లో స్థానిక ఏఎస్ఎన్ డిగ్రీ కాలేజీ విద్యార్థి ఎస్.వంశీ తన ఆల్‌రౌండ్ ప్రతిభతో బంగారు పతకం సాధించి, 'మిస్టర్ నాగార్జున' టైటిల్‌ను సాధించాడు.

మార్చిలో కేరళలో జరగనున్న అంతర యూనివర్సిటీల పోటీలకు ఏఎన్‌యూ తరఫున ప్రాతినిధ్యం వహించనున్నాడు. స్థానిక గంగానమ్మపేటలోని క్విక్ ఫిట్‌నెస్ ఎరీనాకు చెందిన బాడీబిల్డర్ వంశీని సంస్థ యాజమాన్యం, కోచ్‌లు బుధవారం అభినందించారు. అతడితోపాటు తమ దగ్గర శిక్షణ పొందుతున్న ఎం.షానూన్ మార్చి 17-20 తేదీల్లో జమ్ముకశ్మీర్‌లో జరగనున్న ఆలిండియా పవర్‌లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌కు కేఎల్‌యూ తరఫున ప్రాతినిధ్యం వహిస్తోందని ఎరీనా నిర్వాహకులు తెలిపారు. రానున్న మే నెలలో జరగబోయే ఆసియన్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌కు షానూన్ భారత్ తరఫున ప్రాతినిధ్యం వహించనుండటం గర్వకారణంగా చెప్పారు. అదేవిధంగా తమ విద్యార్థిని ఈఎల్ వినయశ్రీ కూడా మే నెలలో జరిగే ఆసియన్ పవర్‌లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌కు భారత్ తరఫున పాల్గొననున్నట్టు వివరించారు. ఈ సందర్భంగా వంశీ, ఇతర మహిళా లిఫ్టర్లను కేవీఐకే జిమ్ యాజమాన్యం కొమ్మినేని భార్గవ్‌కుమార్, కోచ్‌లు ఘట్టమనేని సాయిరేవతి (కామన్‌వెల్త్ గోల్డ్ మెడలిస్ట్), పూసపాటి శివరామకిరణ్‌రాజు అభినందించారు.



'మిస్టర్ నాగార్జున' వంశీతో లిఫ్టర్లు, కోచ్‌లు

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి



తాడేపల్లి రూరల్: ఏసీసీ సిమెంటు ఫ్యాక్టరీ కార్మికుల సమస్యలను పాలకులు పరిష్కరించాలని సీఐటీయూ తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు డిమాండ్ చేశారు. పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో బుధవారం కార్మికులు నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్ష శిబిరాన్ని ఆయన యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్‌తో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా దుర్గారావు మాట్లాడుతూ తమకు న్యాయంగా రావాల్సిన బకాయిల కోసంసిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు దీక్షలు నిర్వహిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం వెంటనే సమస్యను పరిష్కరించి చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని ఆయన కోరారు. యాజమాన్యం, కార్మిక నాయకులతో జాయింట్ మీటింగ్ ఏర్పాటు చేసి సమస్య పరిష్కారానికి చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎం.ఆశీర్వాదం, ఇస్మాయిల్, పుష్పరాజు, పిచ్చయ్య, బాషా, సుబ్బారావు, సామ్రాజ్యం, రిబ్కా, నూర్జహాన్, మాలిన్, గురవయ్య పాల్గొన్నారు.